క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ సిటీ: నగరంలోని వివిధ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.ఉదయ్‌భాస్కర్ గురువారం తెలిపారు. 11 కేవీ సూర్యనారాయణపురం ఫీడర్ పరిధిలోని టెక్స్‌టైల్స్ ఏరియా, తిలక్ స్ట్రీట్, రాజాజీ స్ట్రీట్, నేలపున్న సెంటర్, రంగయ్యానాయుడు వీధి, పూసర్ల వారి వీధి, వివేకానంద స్ట్రీట్, పెదమార్కెట్ ఏరియాలకు సరఫరా ఉండదన్నారు. అదే విధంగా 11 కేవీ డ్రైవర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో మహాలక్ష్మినగర్, లక్ష్మీనగర్, నాయకర్‌నగర్, రణదీప్‌నగర్, డ్రైవర్స్ కాలనీ, ఏఎస్ఆర్ నగర్, యానాం రోడ్డుల్లో సరఫరా ఉండదన్నారు. 11 కేవీ నడకుదురు 2వ ఫీడర్ పరిధిలో కోటిపల్లి రోడ్, కుసుమ సత్య రైస్‌మిల్లు, తులసినగర్, ఈస్ట్‌కోస్ట్ ఫీడర్ పరిధిలో బీచ్‌రోడ్, పోర్టు ఏరియాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

భవిష్యత్తుకు పునాదులు వేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

కాకినాడ రూరల్: ఉపాధ్యాయులు ఉత్సాహంగా పనిచేసి, మంచి బోధనతో విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాలని డీఈఓ పి.రమేష్ సూచించారు. కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం మండల పరిధిలోని ఉపాధ్యాయులు, హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ రంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యా వ్యవస్థలో మార్పులకు అనుగుణంగా పని చేయాలని, రోల్ పెంచాలని సూచించారు. మెరుగైన ఫలితాల కోసం మోటివేషన్ చేశారు.

44 మందికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి మోటారు సైకిళ్లు నడిపిన కేసుల్లో నలుగురికి ఐదు రోజుల చొప్పున జైలు, 20 మందికి మూడు రోజుల చొప్పున, మరో 20 మందికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ తీర్పు చెప్పారు. ఆ వివరాల్లోకి కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. గురువారం కోర్టులో 44 మందిని హాజరుపర్చగా వారికి పైవిధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

వ్యాఖ్యలపై ఖండన

కాకినాడ సిటీ: తిరుమలపై పలువురు చేస్తున్న ఆరోపణలను తిరుమల పాలకవర్గ సభ్యుడిగా తీవ్రంగా ఖండిస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. గురువారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముందడుగు వేస్తున్న న్యాక్ సంస్థ

సామర్లకోట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) మరింత ముందుకు వేస్తుందని న్యాక్ కాకినాడ జిల్లా అసిస్టెంట్ డైరెక్టరు జె.రాజు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ స్థానిక సీబీఎం సెంటర్‌లో ఉన్న న్యాక్ సంస్థ గృహ నిర్మాణ రంగంలో నిరుద్యోగ యువకులకు శిక్షణ ఇచ్చి అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. శ్రామిక శక్తిని మరింత ముందుకు తీసుకు వెళ్లడానికి ప్రపంచ నిర్మాణ, కాంక్రీటింగ్ పరికారాల తయారీదారులలో ఒకటైన ష్వింగ్ స్టెటర్ (ఇండియా) కంపెనీతో న్యాక్ ప్రతినిధులు ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్ర న్యాక్ డైరెక్టరు జనరల్ గుమ్మల గణేష్‌కుమార్, అదనపు డైరెక్టరు జనరల్ మనోహర్ దేవపట్ల సమక్షంలో ష్వింగ్ స్టెటర్ తరుపున వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఆనందకుమార్ ఒప్పందంపై సంతకాలు చేశారన్నారు. దాంతో రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడానికి అవకాశం ఏర్పడుతుందని న్యాక్ అదనపు డైరెక్టరు జనరల్ మనోహర్ అభిప్రాయ పడిన్నట్టు చెప్పారు. ఈ ఒప్పందంకు తగిన విధంగా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు ఉపాధి మార్గాలు సులభతరం అవుతాయని తెలిపారు. సామర్లకోటలోని శిక్షణా సంస్థలో మరింత నైపుణ్యంతో శిక్షణ ఇచ్చే ఫ్యాకల్టీలను తయారు చేస్తామన్నారు. అంతర్జాతీయ ఉపాధి మార్కెట్‌కు తగిన రీతిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన శ్రామిక శక్తి రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు నేరుగా దోహదపడుతుందన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యం కావాలి

సామర్లకోట: మండలంలో నిరక్షరాస్యులు లేకుండా చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి అన్నారు. అక్షరాంధ్రలో భాగంగా గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి మండల పరిధిలో ఎంపిక చేసిన వలంటీర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. వలంటీర్లు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చేస్తారన్నారు.

అవైర్‌నెస్ ఏదీ?

- యమపాశాల్లా విద్యుత్ తీగలు
- రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు
- పట్టించుకోని అధికారులు

కాకినాడ లీగల్: విద్యుత్.. నిత్య జీవితంలో ఎంతో కీలకమైంది. అలాంటి విద్యుత్ విషయంలో అవగాహన లేకుంటూ ప్రాణానికే ముప్పు వస్తోంది.. అయినా ఆ శాఖలో నిర్లక్ష్యం వెంటాడుతోంది. కాకినాడ నగరంలో ఏ వీధిలో చూసినా స్తంభాల నుంచి విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా ఉండి కిందకు వేలాడుతూ ప్రమాదాలను సూచిస్తోంది. ఒకే విద్యుత్ స్తంభంపై ఎక్కువ సర్వీసులు ఉండడం, భవనాలకు అనుకుని విద్యుత్ తీగలు వేలాడడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన నెలకొంది. విద్యుత్ స్తంభాలకే పలు కేబుల్ వైర్లు వేసినా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కేబుల్ సర్వీసు వైర్లు విద్యుత్ స్తంభాల నుంచి నేలపైకి వేలాడుతుండడంతో పాదచారులు, వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విధంగానే పాఠశాలల వద్ద ఉండడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. తీగలు ఒక దానితో ఒకటి కలసిపోవడంతో విద్యుత్ ప్రవాహంలో తేడాలు వచ్చి ఇంట్లో విలువైన వస్తువులు కాలిపోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. విద్యుత్ స్తంభాలపై విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా ఉండడం, వాటికి తోడు కేబుల్ వైర్లు కట్టడంతో ఏ ఇంటికో విద్యుత్ అంతరాయం కలిగితే స్తంభంపై ఉన్న వైర్లను తప్పించి మరమ్మతులు చేయడానికి విద్యుత్ సిబ్బంది నరకం చూస్తున్నారు. స్థానిక గాంధీనగర్‌లో ఒంటిమామిడి జంక్షన్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ తీగలు కిందకు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె లేదు. రామారావుపేట నాగేశ్వరరావు వీధిలో చేతికందే ఎత్తులో ఉన్న ఫ్యూజ్ బాక్సు ఉంది. గాంధీనగర్ వద్ద గాంధీ విగ్రహం సమీపంలో పిచ్చిమొక్కలు మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఇక్కడ తరచూ మంటలు వస్తున్నాయి. గాంధీనగర్ రెడ్‌క్రాస్ వీధిలో విద్యుత్ స్తంభానికి ఉన్న కేబుల్ వైర్లు కిందకు వేలాడుతున్నాయి. నగరంలో అనేక విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లు, అనేక ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు చుట్టూ కంచెలు లేవు.

ఏదో ఒకచోట ప్రమాదం

రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వాహనాలు కాని, ఇతర ఏ దుకాణాలు ఉన్నా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. నగరంలో ఏదో ఒకచోట ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం, మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయందోళన చెందుతునారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కనీసం రక్షణగా ఉండే కంచె ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.



రెడ్‌క్రాస్ వీధిలో విద్యుత్ స్తంభానికి ఉన్న కేబుల్ తీగలు కిందకు వేలాడుతూ..



గాంధీనగర్‌లో ఒంటిమామిడి జంక్షన్ వద్ద ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్



నాగేశ్వరరావు వీధిలో చేతికి అందే ఎత్తులో ఉన్న ఫ్యూజ్ బాక్సు



గాంధీ విగ్రహం సమీపంలో పిచ్చిమొక్కల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అస్తవ్యస్తంగా విద్యుత్ తీగలు



నగరంలో ఏ విద్యుత్ స్తంభం చూసిన విద్యుత్, కేబుల్ తీగలతో అస్తవ్యస్తంగా ఉంటోంది. విద్యుత్, కేబుల్ తీగలు కిందకు ఉండడంతో ఎవరికై నా తగిలితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. చాలాచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు ఉండడం లేదు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉండే ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి మరమ్మతులు చేయించడం, విద్యుత్, కేబుల్ తీగలను సరిచేయడం చేయాలి.

– జీఎస్ఆర్ కృష్ణారావు, స్థానికుడు

తడి, పొడి చెత్తను విడిగా సేకరించాలి



గొర్రిపూడిలో పారిశుధ్య పనుల నిర్వహణపై సూచనలిస్తున్న ఎంపీడీఓ అనుపమ

కరప: గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించేటప్పుడు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించాలని ఎంపీడీఓ ఎం.అనుపమ సూచించారు. గొర్రిపూడిలో గురువారం ఆమె పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు పనుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. రోజూ పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి, వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, కాలువల్లో పూడిక తీయాలని, దోమల నివారణకు ఎబేట్ మందును పిచికారీ చేయాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద సెకండ్ లెవెల్‌లో తడి, పొడి చెత్తను విడదీసి, వర్మికం పోస్ట్ తయారీ తదితర అంశాలపై ఆమె సిబ్బందికి అవగాహన కల్పించారు. క్లోరినేషన్ చేసిన తర్వాతే తాగునీరు సరఫరా చేయాలన్నారు. అనంతరం గ్రామస్తులను ఎంపీడీఓ అనుపమ కలసి పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్త విడదీసి ఇవ్వాలన్నారు. పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. కొరిపల్లి గ్రామంలో డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు పర్యటించి పారిశుధ్య పనులు నిర్వహణను తనిఖీ చేశారు. గ్రామ కార్యదర్శులు ఎస్.వీరబాబు, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కన్నబాబుకు పరామర్శ

కరప: పితృ వియోగంలో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, సినీ డైరెక్టర్ కళ్యాణకృష్ణలను గురువారం మండలంలోని పలువురు నాయకులు పరామర్శించారు. కన్నబాబు తండ్రి, పార్టీ సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. కాకినాడ వైద్యనగర్‌లోని కన్నబాబు నివాసానికెళ్లి, పార్టీ నాయకుడు కురసాల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, పార్టీ నాయకులు నక్కా సత్తిబాబు, భోగిరెడ్డి సూర్యనారాయణ, అప్పనపల్లి పెద్ద, అడబాల ప్రసాద్, మద్దూరి భాస్కర్, చోడిశెట్టి చంటి, సాదే లోహిదాస్, కోలా శ్రీనివాస్, వజ్రపు కామేశ్వరరావు, మార్శెళ్ల వెంకటరమణ, వాసంశెట్టి వెంకటరమణ తదితరలు పరామర్శించిన వారిలో ఉన్నారు.



కాకినాడలో కురసాల సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మండల నాయకులు

ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ జామ్

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గురువారం సాయంత్రం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనదారులు ఇబ్బంది పడ్డారు. బ్రిడ్జిపై అడుగడుగునా గోతులు ఉండడంతో వాహనదారులు గోతులను తప్పించే క్రమంలో ఎడమ వైపు నుంచి కుడి వైపునకు వస్తున్నారు. దాంతో ఎదురుగా వచ్చే వాహనాలకు మార్గం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. గత వారం రోజులుగా ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో రద్దీగా ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గోతులను పూడ్చకపోవడంపై వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. పెద్దాపురం-రాజానగరం ఏడీబీ రోడ్డులో ఉన్న కార్పొరేట్ కళాశాల నుంచి వచ్చే బస్సులతో బ్రిడ్జి రద్దీగా ఉంటుంది. ఇటువంటి సమయంలో వాహనాలు నిలిచిపోవడంతో కళాశాలకు చెందిన విద్యార్థులు రోడ్డుపైకి దిగడంతో చిన్న వాహనచోదకులు కూడా రాకపోకలు సాగించడానికి అవకాశం ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈనెల 23న పెద్దాపురం నియోజకవర్గంలో సీఎం పర్యటనను పురస్కరించుకొని ఏర్పాట్లను పర్యవేక్షించడానికి కాకినాడ నుంచి జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్లు రాకపోకలు సాగించడంతో పోలీసులు ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా వచ్చే వాహనాలను నిలిపి వేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.



సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బారులు తీరిన వాహనాలు

సత్రం కూల్చివేతపై దేవదాయ కమిషనర్‌కు నివేదిక

అన్నవరం: రత్నగిరిపై వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శిథిలావస్థకు చేరిన సీతారామ సత్రాన్ని కూల్చి వేయాలని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లు ఇచ్చిన నివేదికపై తదుపరి ఉత్తర్వుల కోసం దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌కు ఫైల్ పంపించినట్టు దేవస్థానం అధికారులు గురువారం తెలిపారు. అలాగే ఈ సత్రంలోని గదులను భక్తుల వసతికి అద్దెకు ఇవ్వడాన్ని నిలిపివేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు. జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ల నివేదిక ప్రకారం ఇది కూలిపోయే పరిస్థితిలో ఉన్నందున ఒక వేళ భక్తులు ఈ సత్రంలో బస చేసినపుడు కూలిపోతే ప్రాణాపాయం తప్పదని అధికారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై కూడా స్పష్టత ఇవ్వాలని కమిషనర్‌ను కోరినట్లు అధికారులు తెలిపారు. కాగా జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ల నివేదికపై చర్చించి త్వరలోనే ఆదేశాలిస్తామని కమిషనర్ చెప్పినట్టు అధికారులు వివరించారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కరప: వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ధర్నా చేశారు. ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపు మేరకు బుధవారం మండల పరిధిలోని అంగన్‌వాడీలు కరప చేరుకుని, తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా మండల అంగన్‌వాడీల యూనియన్ అధ్యక్షురాలు ఎ.వీరవేణి మాట్లాడుతూ 2014 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదని, 2019లో 42 రోజుల సమ్మెతో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చినా, ఇంతవరకూ ప్రభుత్వం దానిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అంగన్‌వాడీ కేంద్ర నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పనిచేయక, సిగ్నల్స్ లేక పోషణ ట్రాకర్, బాలసంజీవిని అమలుకు యాప్‌లు సపోర్టు చేయడం లేదన్నారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టామన్నారు. అనంతరం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, మినీలను మెయిన్ వర్కర్లుగా మార్చుతూ జీఓ ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్ ఇన్, అవుట్ రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, గ్రాడ్యుటీ జీఓలో మార్పులు చేయాలని, హెల్పర్ల పదోన్నతికి గైడ్‌లైన్స్ రూపొందించాలని, తదితర సమస్యల పరిష్కారం కోరుతూ తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్‌కు వినతి పత్రం ఇచ్చారు. మండల అంగన్‌వాడీల యూనియన్ ప్రతినిధులు ఎం.భవానీ, ఎస్.వరలక్ష్మి, వి.నాగజ్యోతి, బి.రత్నం, కె.సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.



కరపలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ధర్నా చేస్తున్న మండల అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

కాకినాడ రూరల్‌లో..

కాకినాడ రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు కాకినాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నల్ల చీరలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు యాప్‌ల భారం తగ్గించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కుమారికి వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ నేతలు వీరమణి, రాజేశ్వరి, లక్ష్మి, తనుజ, వరలక్ష్మి, మహాలక్ష్మి, సత్యవేణి, సీఐటీయూ నాయకులు రాజా, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విశ్వసాహితీ కళావేదిక అధ్యక్షుడిగా 'తురగా'



బోట్‌క్లబ్: విశ్వసాహితీ కళావేదిక కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా ప్రముఖ నటుడు, సాహితీ వేత్త తురగా సూర్యారావును ఎంపిక య్యారు. కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు రమావతి గురువారం నియామక ఉత్తర్వులు అందించనున్నట్లు తురగా సూర్యారావు ఓ ప్రకటనలో తెలిపారు. తనను జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కమిటీకి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

బోట్‌క్లబ్: స్థానిక వృద్ధుల ఆశ్రమంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, శ్రీవల్లి, నాగేంద్ర, నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శిక్షణ ప్రారంభం

కాకినాడ క్రైం: జిల్లాలో ఎన్‌సీడీ 4.0 పేరుతో త్వరలో క్యాన్సర్‌ను గుర్తించేందుకు ప్రారంభం కాబోతున్న స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణకు బృందం సమాయత్తమవుతోంది. కాకినాడలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఈ శిక్షణ ప్రారంభమైంది. ఇది గురువారం నుంచి 27వ తేదీ మధ్య జరగనుంది. వైద్యాధికారులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొంటున్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు.



శిక్షణకు హాజరైన బృందంతో డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహ నాయక్

వైద్యం... సేవే లక్ష్యం

బాలాజీచెరువు: ఆరోగ్యమే మహా భాగ్యం అంటుంటారు పెద్దలు.. అయితే ఒంట్లో నలతగా ఉంటే వెంటనే వైద్యశాలలను సంప్రదిస్తే వారు దాదాపు రెండు, మూడు రకాల వైద్య పరీక్షలకు ల్యాబ్‌లకు రిఫర్ చేయడం పరిపాటి. పరీక్షలను బట్టి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకూ ఖర్చవడంతో అనేక మంది ఆర్థికంగా సతమతమవుతుంటారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాలు ఇబ్బంది పడుతుంటారు. ఇటువంటి వారిని దృష్టిలో ఉంచుకుని లాభాపేక్ష లేకుండా నామమాత్రపు రుసముతో నగరానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు డాక్టర్ బాదం బాలకృష్ణ గత 2023లో నాగమల్లితోట జంక్షన్ వద్ద ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో బాదం బాలకృష్ణ పేరుతో ల్యాబ్ ఏర్పాటు చేశారు. కేవలం రూ.50తో జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ వంటి ఓపీ సేవలు అందిస్తున్నారు. ల్యాబ్ ప్రారంభంలో రోజుకు దాదాపు 100 మంది వరకూ రాగా, నేడు 200కు పైగా సేవలు పొందుతున్నారు. ఇక్కడ సాధారణ బీపీ, షుగర్, ఎఫ్‌బీఎస్, డిజిటల్ ఎక్స్‌రే, థైరాయిడ్, లివర్, డెంగీ, ఈసీజీ, డప్లర్, 2 డీఎకో, టీఎంటీ, ఈఎస్ఆర్, యూరిస్ యాసిడ్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ, వీడీఆర్ఎల్, డెంగీ సెరాలజీ తదితర 30 రకాల వైద్య పరీక్షలు నామమాత్రపు రుసుముకే చేస్తున్నారు. నిపుణులైన సిబ్బందిని నియమించి పరీక్షలు చేయిస్తున్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి మాత్రమే వైద్య పరీక్షలు చేయాలని నిర్ణయించారు. మార్కెట్ ధరలతో పోలిస్తే మూడో వంతు ధరలు మాత్రమే వసూలు చేస్తున్నారు.



నాగమల్లితోట జంక్షన్‌లో ల్యాబ్

ఆర్థిక స్థోమత లేనివారికి..



ఆర్థిక స్థోమత లేనివారికి ఆరోగ్య సేవలు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ల్యాబ్ ఏర్పాటు చేశాం. రూ.2 కోట్ల విలువైన స్థలం పలివెల సత్యరాజు మెమోరియల్ ట్రస్ట్ నుంచి ఇవ్వగా, పరికరాలు తదితర వాటికి దాదాపు రూ.2.50 కోట్లు అయ్యింది. నగరంలో పేరొందిన వ్యాపారస్తులు, అలాగే సీపోర్టు యాజమాన్యం వంటి వారు ఎక్విప్‌మెంట్ అందజేశారు. కచ్చితమైన నాణ్యమైన రిపోర్టుల కోసం నాణ్యత కలిగిన పరికరాలు ఏర్పాటు చేశాం.

– డాక్టర్ బాదం బాలకృష్ణ, క్లినికల్ ల్యాబ్ చైర్మన్

సగం ధరకే పరీక్షలు



వైద్యులు సూచించిన పరీక్షల మేరకూ ఈ ల్యాబ్‌ను సంప్రదించాను. ల్యాబ్‌లో అన్ని ఆధునిక పరికరాలతో పాటు కార్పొరేట్ తరహాలో ఏర్పాటు చేశారు. ప్రైవేట్ ల్యాబ్‌ల పరీక్షలతో పోలిస్తే నూటికి రూ.60 వరకూ తేడా కనిపిస్తుంది. ఇటువంటి సౌకర్యాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్.శివరామరాజు, కాకినాడ

జిల్లాకు మహాదాత నాయకర్ పేరు పెట్టాలి




తాళ్లరేవు తహసీల్దార్ త్రినాథరావుకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా ఐక్య మహా సమితి ప్రతినిధులు

తాళ్లరేవు: కాకినాడ జిల్లాకు విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ పేరు పెట్టాలని కోరుతూ జిల్లా ఐక్య మహా సమితి ప్రతినిధులు తహసీల్దార్ పితాని త్రినాథరావుకు వినతిపత్రం అందజేశారు. సత్యలింగం నాయకర్ కోరంగి గ్రామంలో జన్మించి, రంగూన్ వెళ్లి ఓడరేవుల రవాణా వ్యాపారం చేసి ఎంతో ఆస్తిని సంపాదించారని పేర్కొన్నారు. 1912లో ఎంఎస్ఎన్ చారిటీస్ సంస్థను ఏర్పాటు చేసి తన యావదాస్తిని విద్యా సంస్థలకు, దేవాలయాలకు ధారాదత్తం చేసిన మహాదాత అని అన్నారు. ఆ సంస్థ ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత విద్య, పేద విద్యార్థులకు ఉచిత భోజన వసతి, అలాగే వేద పాఠశాల నిర్వహణ వంటి ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును కూడా అందజేసినట్లు తెలిపారు. అటువంటి మహనీయుని చరిత్ర భావితరాలకు తెలిసే విధంగా ఆయన పేరును కాకినాడ జిల్లాకు పెట్టాలని శ్రీమల్లాడి సత్యలింగం నాయకర్ జిల్లా ఐక్య మహాసమితి అధ్యక్షుడు వైదాడి నూకరాజు, కామాడి మాతరాజు, అంగాడి తాతారావు, రత్న ముత్యాలు, కొల్లు శ్రీను, పి.నాగేషు తదితరులు కోరారు.

ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ చరిత్ర సృష్టించిన వ్యక్తి రామారావు

- చేనేత రంగ అభివృద్ధికి కృషి
- ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు

పెద్దాపురం: దక్షిణ భారత స్థాయిలో జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావడమే గాక, ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ చరిత్ర సృష్టించిన మహానేత, అపరభగీరథుడు ముప్పన రామారావు అని, ఆయన ఆశయ సాధన కోసం చేనేత రంగ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు అన్నారు. రామారావు జయంతి పురస్కరించుకుని పెద్దాపురం పట్టణ చేనేత వర్గాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత రంగం అభివృద్ధి ఆరంభం అయ్యిందంటే తన తండ్రి రామారావు చలువతోనేనన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ చేనేత రంగ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తొలుత స్థానిక మున్సిపల్ సెంటర్ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని రెండు చేనేత సహకార సంఘాల కార్యాలయాల్లోనూ రామారావు జయంతి నిర్వహించి ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తూతిక సత్యన్నారాయణ, కె.సత్తిబాబు, మల్లిబాబు, ప్రకాష్, జయ, రాజు, పురుషోత్తం, చంద్రరావు, శ్రీను, శేఖర్, చేనేత సహకార సంఘాల సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



ముప్పన రామారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీర్రాజు